

జంగంగుంట్లలో మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు


కొనకనమిట్ల: చినారికట్లలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల


బేస్తవారిపేటలో ఉట్టికొడుతున్న మహిళలు


మార్కాపురం: ఆర్టీసీ డీఎంకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న బ్రహ్మకుమారి సరస్వతి


గిద్దలూరులో ఊరేగింపులో వస్త్ర గణపతి


తర్లుపాడు: గణేష్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు


మార్కాపురం: పూజలందుకుంటున్న సర్ప విఘ్నేశ్వరుడు


పూజలు చేస్తున్న చైర్మన్ దంపతులు

గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

బేస్తవారిపేట:

మండలంలోని పందిళ్లపల్లె, పూసలపాడు, ఖాజీపురం, చెట్టిచర్ల, బేస్తవారిపేట, పెద్ద ఓబినేనిపల్లెలో సోమవారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేకంగా అలంకరించిన పందిళ్లలో పూజలందుకున్న వినాయక ప్రతిమలను తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపుగా తరలించారు. బేస్తవారిపేట పరిసర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను చీతిరాల కతువ, కంభం చెరువు వద్దకు నిమజ్జనానికి ట్రాక్టర్లపై తీసుకెళ్లారు. పూసలపాడు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ జెండాలు, జగనన్న కటౌట్‌లతో, డీజే పాటలతో హోరెత్తించారు.

రెండో రోజు కంభం చెరువులో నిమజ్జనం

కంభం: కంభం చెరువు కట్టపై రెండో రోజు నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు కంభం చెరువులో నిమజ్జన వేడుకలు జరగ్గా సోమవారం పలు గ్రామాల్లోని విగ్రహాలు కంభం చెరువుకు నిమజ్జనానికి తరలి వెళ్లారు. పట్టణంలోని ఆల్ఫా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని సోమవారం విద్యార్థులు, అధ్యాపకులు కలసి నిమజ్జనానికి తీసుకెళ్లారు.

జంగంగుంట్లలో ఘనంగా వినాయకచవితి వేడుకలు

మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి గ్రామంలో పాటకచేరీ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గిద్దలూరు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకటరాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి లు గ్రామంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నారు. వినాయక మండపం వద్ద జరిగిన పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు పాల్గొని గ్రామస్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. సోమవారం నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దండాలయ్యా బొజ్జగణపయ్య

రాచర్ల: మండలంలోని చినగానిపల్లె, రాచర్ల, ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న బొజ్జ గణపయ్య విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామంలో వినాయక విగ్రహానికి విరాళంతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించిన నర్లగొర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతులను గ్రామస్తులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పందెనబోయిన పెద్దబాలరంగయ్య స్వామి వారి లడ్డుని వేలంపాటలో రూ.26 వేలతో దక్కించుకున్నారు. కార్యక్రమంలో సూర స్వామిరంగారెడ్డి, సూర పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కంభంలో విద్యార్థినుల కోలాటం

ఆనందోత్సాహాల మధ్య వినాయకుడి నిమజ్జన మహోత్సవం

గిద్దలూరు రూరల్: వినాయక చవితి పండగను పురస్కరించుకుని మండలంలోని ప్రజలు సోమవారం ఆనందోత్సాహాల మధ్య వినాయకుడి నిమజ్జన మహోత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని గణేష్‌నగర్, నల్లబండ బజారు, రాజానగర్, పొట్టిశ్రీరాములు వీధి, పాండురంగారెడ్డి నగర్, నరసింహస్వామి మెట్ల రోడ్డు, పాత సత్యనారాయణ థియేటర్ వీధి, పాములపల్లెరోడ్డు, శ్రీరామ్‌నగర్, పి.ఆర్.కాలనీ, వివేకానంద కాలనీ, రాచర్ల రోడ్డు, వెంకటేశ్వర కాలనీ వంటి వీధులతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం కె.ఎస్.పల్లె గ్రామ సమీపంలోని సగిలేరు వాగులో, కొండపేట ఆంజనేయస్వామి వద్ద సగిలేరువాగులో, కంచిపల్లె చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. వినాయకుడి మండపాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. పొట్టిశ్రీరాములు విగ్రహం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వస్త్ర గణపతి మండపం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం, నృత్య ప్రదర్శనలు అలరించాయి. వినాయకుడి మండపాల వద్ద పెద్ద లడ్డు ప్రసాదాలను స్వామి వారి వద్ద ఉంచి వేలంపాట నిర్వహించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

అర్థవీడు (బేస్తవారిపేట): మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథులను సోమవారం నిమజ్జనానికి తరలించారు. డీజే, తీన్మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లె చెరువు అలుగు వద్దకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఎస్సై బీ సుదర్శన్‌యాదవ్ నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు

కొమరోలు: మండల వ్యాప్తంగా గణనాథుని నిమజ్జన వేడుకలు సోమవారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. 3వ రోజు సోమవారం గ్రామ గ్రామాన మండపాల్లోని వినాయకుడిని ట్రాక్టర్లలో ఊరేగిస్తూ యువత రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా నిమజ్జనానికి తరలించారు. మండలంలోని మూలపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన లడ్డూ వేలంపాటలో తమ్మిరెడ్డి కొండారెడ్డి రూ.66 వేలకు పాడగా, తాతిరెడ్డిపల్లె గ్రామంలో ఎస్సీపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ వేలంపాటలో రవికుమార్ రూ.43,100కు దక్కించుకోగా కొమరోలులోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన మండపంలో బద్రి నాగార్జున రూ.26 వేలకు లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నాడు.

భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు

తర్లుపాడు: మండలంలో గణేష్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. వినాయక స్వామి నవరాత్రుల్లో భాగంగా మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలతో మండపాలు కళకళలాడుతున్నాయి. తర్లుపాడులో గణేష్‌రెడ్డి యూత్, ఆర్యవైశ్య సంఘం, బీసీ కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు స్వామి వారికి సోమవారం విశేష పూజలు చేశారు. వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని భక్తులు వేడుకుంటున్నారు.

ఆల్ఫా స్కూల్లో నిమజ్జన సంబరాలు

పొదిలి: స్థానిక ఆల్ఫా ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు. సోమవారం సాయంత్రం నిమజ్జన సంబరాలు చేశారు. ముందుగా చైర్మన్ మాలకొండారెడ్డి, వసంత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాణసంచా కాలుస్తూ, గులాములు చల్లుకుంటూ మేళ తాళాలతో యువకులు, విద్యార్థులు నృత్యాలు చేస్తుండగా విఘ్నేశ్వరుని ఊరేగింపు జరిగింది. ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. లడ్డూను రూ.15,500లకు బద్దిగం రేణుక వేలంలో దక్కించుకున్నారు. డీన్ రితేష్ నాయర్, ప్రధానోపాధ్యాయుడు బరిగె ఏడుకొండలు, ఏఓ కెల్లంపల్లి నజీర్, ఇన్‌చార్జ్ శశికళ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: వినాయక చవితి పండగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను మూడో రోజు సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ముందుగా వినాయకునికి విశేష ఉత్సవ పూజలు చేశారు. వినాయకునికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలకు వేలంపాట నిర్వహించారు. ఊరు వాడా కదిలింది. విగ్రహాలను గ్రామాల్లో మేలతాళాలతో బాణ సంచా కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. యువకులు రంగురంగుల గులాంలు చల్లుకుంటూ జై గణేషా జైజై గణేషా అనుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. గొట్లగట్టు, కొనకనమిట్ల, చినమనగుండం, నాయుడుపేట, వెలుగొండ్రాయునిపల్లి, చినారికట్ల, మర్రిపాలెం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లోని వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. గొట్లగట్టులో భక్తులు విశేష పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మహిళలు గులాంలు చల్లుకుంటూ ఉత్సాహంగా కోలాటమాడి నిమజ్జనంలో పాల్గొన్నారు. చినారికట్లలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఎస్‌ఐ కె.మాధవరావు తన సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.


రాచర్లలో విగ్రహ దాత నర్లగొర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతులకు సన్మానం చేస్తున్న గ్రామ పెద్దలు

మార్కాపురం: పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గణేష్ నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు వందకుపైగా గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. సోమవారం మూడో రోజు కావడంతో పలువురు నిర్వాహకులు తాము ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. పట్టణంలోని ఎస్ఎస్ నగర్‌లోని బ్రహ్మకుమారీస్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, కాంట్రాక్టర్ బీవీ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మకుమారి సరస్వతీ వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శాంతి సహనంతో పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. పట్టణంలోని అమ్మవారిశాల వద్ద, తేరు బజారులో, జవహర్‌నగర్ కాలనీ, కంభం రోడ్డు, శ్రీనివాస థియేటర్ ఎదుట లైన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.


నిమజ్జనానికి వినాయకుడిని తీసుకెళ్తున్న కంభం ఆల్ఫా స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు


నిమజ్జనానికి తరలిస్తున్న గణపతి విగ్రహాలు


కొమరోలులో గణనాథుడిని ఊరేగిస్తున్న యువకులు

క్లుప్తంగా

రూ.2.14 లక్షలు పలికిన వినాయకుని లడ్డూ


జంగంగుంట్లలో రూ.2.14 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ.2.14 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మనుమాసు జ్యోతివీరారెడ్డి వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

విద్యార్థులు విరాళాల సేకరణ


ఎంఈఓకు విరాళం నగదు అందజేస్తున్న సుధాకర్, విద్యార్థులు

పొదిలి: మల్లవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం సోమవారం విరాళాలు సేకరించారు. ఈ విరాళాలు మొత్తం రూ.10 వేలు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డికి ఉపాధ్యాయులు పాశం సుధాకర్, రమణారెడ్డి, శ్రీనివాస్‌లు అందచేశారు. మేఘన, జ్యోతి, జెస్సి, హెప్సి, శివపార్వతి, హేమ, అక్షర, శివకృష్ణ, గౌతమ్, నరసింహ తదితరులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. పెద్ద మనుసుతో విరాళాలు సేకరించిన విద్యార్థినులను ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సహాయక చర్యల్లో చంద్రబాబు ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: గత వారం విజయవాడలో వచ్చిన వరదలపై ప్రజలను అప్రమత్తం చేసి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు విమర్శించారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ విజయవాడకు ఎగువన ఉన్న ప్రాంతాల్లో గతవారం భారీ వర్షాలు పడి కృష్ణా నదికి వరద నీరు రావడంతో పాటు విజయవాడలో ఉండే బుడమేరు కూడా వరద నీరు వచ్చి చేరుతుందని ఇంజినీర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సకాలంలో స్పందించక పోవడంతో విజయవాడలోని వివిధ ప్రాంతాలు జలమయమై, వేలాది మంది నిరాశ్రయులై పలువురు మృతి చెందారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరద అనంతరం కరువు సహాయక చర్యలు చేపట్టడంలో కూడా ప్రభుత్వం ఘోరంగ విఫలమైందని మండిపడ్డారు.


మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ప్రభుత్వం ముందుగానే స్పందించి వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగి ఉండేది కాదన్నారు. పబ్లిసిటీకి ఇచ్చిన ప్రాధాన్యం కూటమి ప్రభుత్వం సహాయక చర్యలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం భావిస్తున్న రాజధానిలో భారీ వర్షానికే వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా తయారైందంటే పరిస్థితెలా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వాధికారులు, మంత్రులు వరద ముప్పుపై సత్వరమే స్పందించి ఉంటే విజయవాడలో భారీ నష్టం జరిగి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ విజయవాడలో పరిస్థితి దారుణంగా ఉందని, ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సాయం అందించాలని, ఇళ్లల్లో వరదలకు కొట్టుకుపోయిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు నష్టపరిహారంతో పాటు పాడైన ఇళ్లకు కూడా పరిహారం ఇవ్వాలని అన్నా రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు.

పౌష్టికాహార లోపాన్ని గుర్తించాలి

మార్కాపురం: తల్లిదండ్రులు గర్భిణుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలని, ఒక వేళ పౌష్టికాహార లోపం ఉంటే వెంటనే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుశీల అన్నారు. సోమవారం కంభం రోడ్డులోని టోల్‌గేట్ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో సలహాలు సూచనలు ఇచ్చి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. బాలింతలు, తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపం లేకుండా పెరగాలంటే ప్రతిరోజూ పాలు, గుడ్డు, ఆకు కూరలు తీసుకోవాలని వివరించారు. ఐరన్ లోపం లేకుండా కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని అందించే వంటకాలు చేసి చూపారు. సూపర్‌వైజరు రమాదేవి, కార్యకర్తలు కృష్ణవేణి, లక్ష్మీ, స్వాతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవీ

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


గజ్జలకొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మార్కాపురం: మండలంలోని గజ్జలకొండ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2006 నుంచి 2010 వరకూ ఆరు నుంచి పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాలలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, గాలిరెడ్డి, సుబ్బారెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, బాలగురవయ్య చొరవ తీసుకుని నెల రోజుల నుంచి పూర్వ విద్యార్థులకు ఫోన్లు చేసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారందరూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. సుమారు 14 ఏళ్ల క్రితం పదో తరగతిని పూర్తి చేసుకుని ఉన్నత చదువుల కోసం బయటకు వెళ్లి చదువులు పూర్తయితే ఉద్యోగాలు చేస్తూ పెళ్లిళ్లు చేసుకున్న మిత్ర బృందం తమ కుటుంబ సభ్యులతో హాజరై ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు వై.శ్రీనివాసులు, హెచ్‌ఎం రామాంజులరెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, కిశోర్‌లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు రాధిక, పావని, అనూష, రాజశేఖర్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి 25 వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు.

గోశాల ఆధ్వర్యంలో ఉచితంగా ఆవులు

మార్కాపురం: పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద గోశాల ఏర్పాటు చేశామని గోశాల ప్రతినిధి నందిరెడ్డి రామిరెడ్డి సోమవారం తెలిపారు. దేవాలయాలకు, ఆశ్రమాలకు ఆవులు కావాల్సిన వారు తనను సంప్రదిస్తే ఉచితంగా ఆవులను ఇస్తామని, వివరాలకు 9885826949 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వరద బాధితులకు రూ.85 వేల సాయం

కొమరోలు: మండలంలోని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ విజయవాడ వరద బాధితుల కోసం తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.85 వేల చెక్కును గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి సోమవారం అందజేశారు. కొమరోలు మండలంలోని పలువురు దాతల సహకారంతో సేకరించిన నగదును గిద్దలూరులోని టీడీపీ కార్యాలయంలో చెక్కు రూపంలో అందజేసినట్లుగా అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరిని అభినందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సన్నపురెడ్డి శివరామకృష్ణారెడ్డి సోమవారం క్రీడా దుస్తులు బహూకరించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడానికి క్రీడా దుస్తులు లేకపోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, పీడీ మాధవీలతలు శివరామకృష్ణారెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి 20 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు బహూకరించినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.